# సూర్య గ్రహణం

కథ

## -బులుసు- జీ- ప్రకాష్

**స్కూళ్ల ఇన్స్పెక్టరుగా వెళ్లిన నేను, సూర్యం మాస్టారి శాస్త్రీయ దృక్పథానికి ఎంతగానో మురిసిపోయాను. అయన్ని, ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుణ్ణి బహుధా ప్రశంసించాను. సూర్యం మాస్టారి వంటి ఉపాధ్యాయులు దేశంలో ప్రతి పాఠశాలలోనూ వుంటే ఎంతబావుణ్ణు?**

నేను స్కూళ్ల ఇన్స్పెక్టరుగా ప్రమోట్ అయిన కొత్తలో మరడాం హైస్కూల్ తనిఖీకి వెళ్లాను. అక్కడ సూర్యం మాస్టారు సోషల్‌స్టడీస్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. సూర్య చంద్ర గ్రహణాలు ఎలా ఏర్పడతాయో ఆయన ఎంతో ఆసక్తితో పాఠం చెప్పుకు పోతున్నారు.

''సూర్యుని చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడూ తిరుగుతున్నప్పుడు, సూర్యుడు-భూమి-చంద్రుడు ఒకే సరళరేఖ మీద తటస్థపడినప్పుడు, సూర్యగ్రహణం కాని చంద్రహణం కాని ఏర్పడుతుంది. సూర్యునిపైని, చంద్రునిపైని నీడ పడినట్లు గ్రహణకాలంలో కనబడుతుంది. సూర్యుని కిరణాలు చంద్రుని మీద పడకుండా భూమి అడ్డువచ్చినప్పుడు చంద్రగ్రహణమని అంటారు. అలాగే సూర్యుడు కనబడకుండా చంద్రుడు భూమికి అడ్డువస్తే సూర్యగ్రహణమని అంటారు.

చంద్రగ్రహణం పౌర్ణమిరోజున, సూర్యగ్రహణం అమావాస్యరోజున ఏర్పడుతుంది''

పిల్లలందరూ చాలా శ్రద్ధగా పాఠం విన్నారు. అందులో ఓ కుర్రాడు లేచి-''అయితే మాస్టారూ! గ్రహణం పట్టినప్పుడు మైల పడిపోయామని, గ్రహణం వీడినప్పుడు మైలశుద్ధి అవుతామని మన వాళ్లు స్నానాలెందుకు చేస్తారండీ?'' అని ప్రశ్నించాడు.

''ఆనాటి ప్రజలకు గ్రహణం ఎలా పడుతుందో తెలియక, రాహుకేతువులనే గ్రహాలు సూర్యచంద్రులను మింగుతాయని భావించారు. అది వారి మూఢ విశ్వాసం. అదే యిప్పటికీ అధిక సంఖ్యాకుల్లో కొనసాగుతోంది!'' అని సమాధాన పరిచారు ఆ కుర్రాడిని.

స్కూళ్ల ఇన్స్పెక్టరుగా వెళ్లిన నేను, సూర్యం మాస్టారి శాస్త్రీయ దృక్పథానికి ఎంతగానో మురిసిపోయాను. అయన్ని, ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుణ్ణి బహుధా ప్రశంసించాను. సూర్యం మాస్టారి వంటి ఉపాధ్యాయులు దేశంలో ప్రతి పాఠశాలలోనూ వుంటే ఎంతబావుణ్ణు?

ఉపాధ్యాయ దినం నాడు రాష్ట్రపతి మహోదయులు అన్న మాటలు:

Sharma wants education system reoriented

NeW Delhi-Presentation of awards to distinguished teachers, seminars and symposia on education and the teaching profession besides garlanding the portraits and statues of second President of India S Radhakrishnan marked his birth anniversary on Sunday celebrated as Teachers Day.

President Shanker Dayal Sharma presented the 1992 national award-for teachers here. Sharma stressed the need to re-orient the educational pattern to meet the national requirements by creating an atmosphere that promotes the spirit of autonomy and creativity and by instilling in the students the spirit of scientific temper and national approach.

He said though the nation had been engaged for many years in traying to re-model the educational system, apart from a rapid expansion of the educational apparatus all along the line, a significant change of objectives or method had yet to take place. PTI, UNI



సూర్యం మాస్టారు అక్షరాలా రాష్ట్రపతి అన్నమాటల్నే ఆచరిస్తున్నారు. కనుక ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు యిప్పించడానికి నేను సిఫార్సు చేయాలనుకున్నాను.

మరో ఐదారు నెలలు పోయేక నేను ఇన్స్పెక్షన్‌కని ఇంకో వూరు వెళ్లి తిరిగి వస్తూ, సూర్యం మాస్టారిని ఓసారి చూడాలనిపించి, ఆయన పనిచేస్తున్న మరడాం గ్రామం వెళ్లేను. ఐతే ఆయనారోజు సెలవు పెట్టేరుట. ఓమాటు ఇంటికెళ్లి పలకరిద్దామని బుద్ధి పుట్టింది. ఆవేళే అమావాస్య, సూర్యగ్రహణం కూడా అన్నమాట నాకు గుర్తు లేదు.

నేను సూర్యం మాస్టారింటికెళ్లే సరికి 11 గంటలయింది. నేను వచ్చినట్లు వాళ్లబ్బాయి ద్వారా కబురుపెడితే-''నాన్నగారు స్నానం చేస్తున్నారు కూర్చోండి'' అన్నాడు. కూర్చున్నాను.

సూర్యం మాస్టారు వచ్చి-''మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టేశాను ఇన్స్పెక్టరు గారూ! గ్రహణం పట్టగానే స్నానం చేశాను. గ్రహణం విడిచేక మళ్లీ స్నానం చేస్తుండగా మీరు వచ్చారు. అంచేత మిమ్మల్ని చాలాసేపు కూచోబెట్టినందుకు క్షమించాలి.'' అన్నారు చేతులు జోడిస్తూ.

నేను ఆశ్చర్యపోయాను! సూర్యం మాస్టారు స్కూల్లో చెప్పిన పాఠానికి, నిజజీవితంలో తన ఆచరణకీ ఎంత తారతమ్యం? మాటలకీ చేతలకీ ఏమీ పొంతనలేకుండా పోయిందే! ఇంతకీ ఆ వేళ గ్రహణం పట్టింది సూర్యునికా? సూర్యం మాస్టారికా? అంటూ జుట్టు పీక్కున్నాను!

★